క్లుప్తంగా

విద్యుత్తు వాడకంలో అక్రమాలు బట్టబయలు

ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: నియోజకవర్గ పరిధి దొమ్మేటిపేట ఇండస్ట్రియల్ కాలనీలో పాత ఇనుమును కరిగించే కనకదుర్గా ఐరన్ కాస్టింగ్ ఫ్యాక్టరీ యాజమాన్యం విద్యుత్ వాడకంలో అక్రమాలకు పాల్పడటంతో ప్రభుత్వానికి సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకూ నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ అన్నారు. శుక్రవారం జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యానాంలో ప్రజా పనులకు సంబంధించి ఆడిట్ జరిగిందని, ఇందులో భాగంగా కనకదుర్గా ఐరన్ కాస్టింగ్ ఫ్యాక్టరీ చేసిన విద్యుత్ అక్రమాలను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు బట్టబయలు చేశారన్నారు. ప్రస్తుతం దానిని మూసివేసినప్పటికీ అప్పటికే ఆ సంస్థ రూ.కోట్ల మేర విద్యుత్‌ను అక్రమ మార్గంలో వినియోగించిందన్నారు. ఈ సంస్థపై కేసు నమోదు చేసినా కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆడిట్ అధికారులు తెలిపారన్నారు. ఇదే కాకుండా మరో రెండు కంపెనీలు సైతం ఇదే పరిస్థితిలో ఉన్నాయన్నారు.

కమిషనర్‌కు అభినందన



మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మనోహర్‌ను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ కమిషనర్ చాంబర్‌లో వ్యాపార ప్రతినిధుల బృందం కలసి కొద్దిసేపు చర్చించింది. పట్టణ పాలనలో వ్యాపారులు మున్సిపాలిటీకి పూర్తిగా సహకరించాలని కమిషనర్ మనోహర్ వారిని కోరారు. వ్యాపార వర్గాల నుంచి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ హామీ ఇచ్చారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ ప్రతినిధులు రేకపల్లి సూరిబాబు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, రాయుడు నాని, చింతలపూడి సత్తిబాబు, మానే ప్రకాష్, వలవల శివరావు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరావు, నంద్యాల బాబి తదితరులు ఉన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: గోడి బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కిరణ్మయి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (రెగ్యూలర్) మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని, లేదా గురుకులానికి స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండి, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 10న రాత పరీక్ష నిర్వహిస్తామని, అందులో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

ఎంపీడీఓగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

కాట్రేనికోన: స్థానిక ఎంపీడీఓగా కె.శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.వెంకటాచలం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి బదిలీ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా కామవరపుకోట ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీదేవి ఇక్కడకు వచ్చారు. కాట్రేనికోన తహసీల్దార్‌గా డి.ప్రశాంతి మచిలీపట్నం నుంచి రానున్నారు.

బోగస్ ధ్రువీకరణ పత్రాలపై ఫిర్యాదు

అమలాపురం టౌన్: బీసీ–ఏ కేటగిరీలో ఉన్న కొందరు, బోగస్ ఎరుకుల కుల (ఎస్టీ) ధ్రువీకరణ పత్రాల జారీ కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా ఎరుకుల సంఘం ప్రతినిధులు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అలాంటి తప్పుడు ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎరుకుల కులస్తులని గుర్తించిన పిదపే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. స్థానిక కలెక్టరేట్ వద్దకు వారు వచ్చి ఈ సమస్యను అధికారులకు ఏకరువు పెట్టారు. మున్సిపల్ కౌన్సిలర్ బండారు గోవిందు, ఎరుకుల సంఘ నాయకులు బండారు ఏడుకొండలు, అమలదాసు రమణ, ఉప్పు శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మేలు
- సొంత గ్రామంలోనే వైద్య సేవలు
- రూపాయి ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

తాళ్లరేవు: ఆరోగ్యమే మహాభాగ్యం నానుడిని ప్రభుత్వం నిజం చేస్తోంది. అందరికీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తుంది.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పల్లెల్లో విశేష ఆదరణ లభిస్తోంది. సొంత గ్రామంలోనే రూపాయి ఖర్చు లేకుండా ఆధునిక వైద్య సేవలు అందిస్తుంది. ముమ్మిడివరం నియోజకవర్గంలో 24 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో తొలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పది వేల మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 116 మందిని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులుగా గుర్తించి వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించారు. ప్రస్తుతం రెండో విడత ఈ కార్యక్రమం కొనసాగుతోంది. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు మండల అధికారులు పాల్గొని ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. గ్రామస్థాయిలో వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందేలా చూస్తున్నారు. అలాగే జ్వరం, దగ్గు, వివిధ రకాల నొప్పులతో బాధపడేవారిని గుర్తించి గ్రామాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వైద్యులచే పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అంతేకాకుండా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులతో అనేక మంది అవసరమైన పరీక్షలు చేయించుకోలేక వ్యాధులు ముదిరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్కరూ వైద్యం అందక ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఐదుగురు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఏడు రకాల టెస్టులను ఉచితంగా చేస్తున్నారు. అదేవిధంగా నేత్ర సమస్యలున్న వారిని మండలంలో ప్రత్యేక నేత్ర వైద్య నిపుణుడు శీరం సత్తిబాబు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది.

ప్రజల నుంచి స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్నారు. తొలి విడతలో గాడిమొగ పంచాయతీలో సుమారు 670 మంది రోగులు చికిత్స చేయించుకున్నారు.

–వీజేవీ రమణ, పంచాయతీ కార్యదర్శి, గాడిమొగ

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కొన్ని రోజులుగా వెన్నునొప్పి బాధిస్తుంది. కాకినాడ వెళ్లి చూపించుకోవాలంటే చాలా ఖర్చవుతుందని ఆలోచించా. ఈ సమయంలో గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో చూపించుకున్నాను. అన్ని రకాల పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు నాకు చాలావరకూ తగ్గింది. తిరిగి మళ్లీ ఇప్పుడు చూపించుకుంటున్నాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–అంగాడి గంగాయమ్మ, లక్ష్మీపతిపురం, గాడిమొగ పంచాయతీ

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



సుంకటరేవులో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సుంకటరేవులోని లేఅవుట్‌లో ఏర్పాటైన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా పథకం కింద ఇప్పటివరకూ మండలంలో నాలుగు దఫాలుగా రూ.43 కోట్లు అందజేశామన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకల దగ్గర నుంచి అవ్వా తాతలకు పింఛన్ల పంపిణీ వరకూ అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పేదలకు అవసరమైన విద్య, వైద్యంతోపాటు పేదల సొంతింటి కలను నెరవేర్చుతుందన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మండలంలో 1,477 గ్రూపులకుగానూ రూ.10.75 కోట్ల చెక్కును మహిళా సంఘం అధ్యక్షురాలు జె.ధనలక్ష్మి, వీరలక్ష్మి తదితరులకు ఆయన అందజేశారు. వైఎస్సార్ క్రాంతిపథం తాళ్లరేవు శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రెడ్డి సన్యాసిరావు, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత, కాపవరపు శ్రీదేవి, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించే వరకూ పోరాటం



మత్స్యకారుల మహా ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

యానాం: చమురు కార్యకలాపాలతో తీవ్రంగా నష్టపోతున్న యానాం నియోజకవర్గ మత్స్యకారులందరికీ సంబంధిత ఓఎన్జీసీ సంస్థ నష్టపరిహారం చెల్లించేవరకూ పోరాటం ఆగదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్ సమీపంలో దరియాలతిప్ప– గిరియాంపేట రహదారిలో మత్స్యకారుల మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్స్యకారులకు నష్టపరిహారం చమురు సంస్థలు ఇవ్వడం తొలిశారని, ఆ విధంగా పోరాటం వల్లే సాధ్యమైందన్నారు. గతంలో లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించిన పేర్లను రీ ఎంక్వయిరీ చేసి మళ్లీ చేర్చాలని డిమాండ్ చేశారు. 24 నెలలకు గాను రూ.150 కోట్లను రెండేళ్లకు డిపాజిట్ చేయాలని తాను ప్రభుత్వాన్ని కోరానన్నారు. కానీ 19 నెలలకు మాత్రమే ఇస్తామని ఓఎన్జీసీ సంస్థ చెప్పిందన్నారు. ఆంధ్రా, యానాం అనే ప్రస్తావన లేకుండా అందరికీ పరిహారం చెల్లించాలని కోరామన్నారు. ఈ సమస్యపై సీఎం, కలెక్టర్, ఫిషరీస్ డైరెక్టర్ తదితరులకు వినతిపత్రం ఇచ్చానన్నారు. అదేవిధంగా లబ్ధిదారుల జాబితాను మార్చడం అన్యాయమని, మొత్తం 5,462 మంది లబ్ధిదారులందరికీ పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు గిరియాంపేట, సావిత్రినగర్, దరియాలతిప్ప, కురసాంపేట, అయ్యన్ననగర్ తదితర ప్రాంతాల మత్స్యకారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్, అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ సేవలను ఎస్పీ అభినందించారు. ఎస్సీ ఉద్యోగులు గ్రామాల్లోని యవతను సంస్కరించే దిశగా సివిల్స్, గ్రూప్–1 పోటీ పరీక్షలకు చేయూతనివ్వాలని సూచించారు. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, అసోసియేషన్ ప్రతినిధులు గెద్దం ప్రదీప్, బీఎస్ఆర్ ప్రసాద్, అంబటి త్రిమూర్తులు, పినిపే సత్యనారాయణ, ఉప్పే నరసింహారావు, మట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు తరలిరావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నాని

అమలాపురం రూరల్: ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగే ఎన్నికల శంఖారావం సిద్ధం సభను విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని) పిలుపునిచ్చారు. ఈ సభకు వెళ్లేందుకు అమలాపురం నియోజకవర్గం నుంచి మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో 100 బస్సులు, 300 కార్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. శుక్రవారం భట్నవిల్లిలోని మంత్రి విశ్వరూప్ నివాసంలో అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. నాని మాట్లాడుతూ కార్యకర్తలు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో తరలిరావాలన్నారు. అమలాపురం నుంచి వెళ్లే వాహనాల కోసం దెందులూరు పీఎస్ఆర్ లేఅవుట్‌లో పార్కింగ్ సౌకర్యం కల్పించారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జీ, ఉండ్రు బాబ్జీ, తోట శ్రీను, రేవు శ్రీను పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై సంబరాలు



రైల్వే లైన్‌కు నిధుల కేటాయింపుపై సంబరాల్లో జేఏసీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కేంద్ర రైల్వే బడ్జెట్‌లో 2024–25 సంవత్సరానికి కోటిపల్లి– నర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్టుకు రూ.300 కోట్లు కేటాయించడంపై కోనసీమ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో సంబరాలు నిర్వహించింది. ఈ నిధులతో రైల్వే ట్రాక్ పనులు వేగవంతం అవుతాయని ఆకాంక్షించింది. అలాగే కాకినాడ– కోటిపల్లి రైల్వే ట్రాక్ పునరుద్ధరణకు బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. ఇది కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ ప్రగతికి సంకేతమని జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ అన్నారు. ఈ మేరకు చిన్న వంతెన వద్ద జేఏసీ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. దేశ ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, అమలాపురానికి చెందిన ఢిల్లీలో బీజేపీ నేత వారణాసి రామ్‌మాధవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమావేశంలో జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు, కో కన్వీనర్ మంత్రిప్రగడ వేణుగోపాల్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్, ఉండ్రు బాబ్జి, కరాటం సూరిబాబు తదితరులు ప్రసంగించారు.

వ్యక్తిపై దాడి

అల్లవరం: దాడి ఘటనపై అల్లవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తూర్పులంకలో గురువారం బీటీ రోడ్డు వేస్తుండగా శ్రీయోగి శ్రీనివాస్ వచ్చి రోడ్డు ఎత్తు పెంచాలని కాంట్రాక్టర్ గుమస్తాని అడిగారు. దీంతో వారిద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. అక్కడే నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న రోడ్డు కాంట్రాక్టర్ కుమారుడు డి.ప్రశాంత్ తన చేతిలో ఉన్న కొలతబద్దతో శ్రీనివాస్ తల, పొట్టపై కొట్టాడు. గాయాలైన శ్రీనివాస్ అల్లవరం పోలీస్ స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై హరీష్‌కుమార్ శుక్రవారం కేసు నమోదు చేశారు.

లబ్ధిదారులకు పరిహారం ఇవ్వాలి

యానాం: యానాంలో మత్స్యశాఖ అధికారులు తయారు చేసిన జాబితా ప్రకారం 5,462 మంది మత్స్యకారులకు మొదటి విడత పరిహారం మంజూరు చేయాలని ఆర్ఏఓ మునిస్వామిని జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం వారు ఆర్ఏఓను ఆయన ఛాంబర్‌లో కలసి పరిహారం విడుదల జాప్యం, తదితర సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ నాయకులు మల్లాడి సత్తిబాబు, బీరాస్వామి, జేజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, బీఎస్పీ అధ్యక్షుడు ధూళిపూడి మధు, ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కొండమూరి హరి పాల్గొన్నారు.

రేపు దంత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైద్యురాలు వంటెద్దు అమృతవల్లి శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారి సమస్య పరిష్కారం

ఉప్పలగుప్తం: చల్లపల్లిలో రహదారులను ఆధునీకరించాలని రవ్వ పరిశ్రమ ట్యాంకర్లను అడ్డుకుని గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. దీనిపై శుక్రవారం చల్లపల్లిలో సీఐ వీరబాబు సమక్షంలో ఆ పరిశ్రమ అధికారులతో చర్చించారు. సవరప్పాలెం నుంచి చల్లపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయించి, చల్లపల్లిలో 2.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మిస్తామని పరిశ్రమ అధికారులు హామీ ఇవ్వటంతో గ్రామస్తులు శాంతించారు.

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



చొల్లంగిలో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: చొల్లంగి పంచాయతీలో ఐదు సొసైటీలకు చెందిన అసైన్డ్ భూములను ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న 55 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పట్టాలను అందజేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 30 ఏళ్లుగా సర్వే నంబరు 231 నుంచి 235 వరకూ ఉన్న భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ ఆ భూములపై ఎటువంటి హక్కులు రాలేదన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన భూ సంస్కరణలో భాగంగా నేడు ఆ భూమిని లబ్ధిదారులకు అప్పగించామని తెలిపారు. దీనికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు, తహసీల్దార్ ఎస్.పోతురాజు, రెవెన్యూ సిబ్బంది, నాయకులను అభినందించారు. 55 మంది లబ్ధిదారులకు 30 ఎకరాలు, గుల్ల చొల్లంగి కో ఆపరేటివ్ సొసైటీకి నాలుగు ఎకరాలు మొత్తంగా 34 ఎకరాలకు భూ హక్కు పత్రాలు (రెవెన్యూ పట్టాల)ను అందజేశారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మాసా శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కనకాల చినబాబు, వారా సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' విజయోత్సవం



'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' సినిమా విజయోత్సవాన్ని నిర్వహిస్తున్న నటీనటులు

అమలాపురం టౌన్: 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రంలో ఇక్కడి నటులు ఎక్కువ మంది నటించడం శుభ పరిణామమని జిల్లా ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు, సినీ నటుడు గనిశెట్టి రమణలాల్ అన్నారు. స్థానిక వెంకటరామ థియేటర్‌లో శుక్రవారం ఈ చిత్రం విడుదలై ప్రదర్శించడంతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ చిత్రంలో కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్‌కు చెందిన నటీనటులు నటించడం మంచి పరిణామమని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సినీ నటుడు గుర్రం రామకృష్ణ అన్నారు. సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా అంబాజీపేట సాయి హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు పాత్ర నిలిచిందన్నారు. కోనసీమకు చెందిన 'ది హేట్ లవ్' చిత్ర సహ నిర్మాత కృష్ణ, ఫిల్మ్ అసోసియేషన్‌కు చెందిన నటీనటులు కర్రి శ్రీహర్ష, సూర్య, నాగ శ్రీనివాస్, వెంకటేష్, భట్నవిల్లి బ్యాండ్ మాస్టార్ రాజు, లోకల్ మేనేజర్ దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఉప్పలగుప్తం: ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో 425 మందికి వైద్య పరీక్షలు, 110 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, సలాది శివాజీ, పోలిశెట్టి వీరబాబు, చప్పిడి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 16న స్కాలర్‌షిప్ పరీక్ష

యానాం: ప్రభుత్వ, గుర్తింపు కలిగిన ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి 16న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు పరీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని పుదుచ్చేరి పాఠశాల విద్య జేడీ డాక్టర్ వీజీ శివగామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యానాం–6, పుదుచ్చేరి–93, కారైకల్–23, మాహే–3 మొత్తం 125 మందిని ఈ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. తల్లిదండ్రుల ఆదాయం, మెరిట్ ప్రకారం ఎంపికైన విద్యార్థులకు రీజియన్‌వైజ్, క్లాస్‌వైజ్, సంవత్సరానికి రూ.12 వేలను 9వ తరగతి నుంచి 12వ తరగతి చదివేవరకూ విద్యాశాఖ అందజేస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 5 నుంచి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

5, 6 తేదీల్లో క్రీడా శిక్షణకు ఎంపికలు

యానాం: యానాం పట్టణ పరిధి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణకు ఎంపిక పోటీలను ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సెంటర్ ఇన్‌చార్జి ఎస్.ఉదయకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో సెలక్షన్ ట్రైల్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్ స్కీమ్స్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం ఆవరణలోని సాయ్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 0884- 2950063, 88851 76888 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల మంజూరు

అమలాపురం టౌన్: స్థానిక సబ్ ట్రెజరీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు 1,999 మందికి లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేశామని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ఎస్‌వీవీ రంగారావు వెల్లడించారు. ఈ విషయాన్ని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులకు ఏటీఓ రంగారావు వివరించారు. తమ లైఫ్ సర్టిఫికెట్లను ఇంకా జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయని పెన్షనర్లు వెంటనే అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. గడువు తేదీ దాటితే అనుమతి ఉండదని అన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న దాదాపు 2 వేల మంది పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను పరిశీలించి మంజూరు చేసిన ఏటీఓ రంగారావుకు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణశాస్త్రి, ప్రధాన కార్యదర్శి కేవీవీ నాయుడు, అసోసియేట్ అధ్యక్షుడు సాయి వరప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, సబ్ రిజిస్ట్రార్ రాణి

అల్లవరం: సచివాలయాల పరిధిలో పేదలందరికీ ఇళ్ల పథకంలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ విధానంపై అధికారులకు, పంచాయతీ కార్యదర్శుల కు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యదర్శి, వీఆర్ఓ, లబ్ధిదారుని ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం అల్లవరం సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని ఎంపీడీఓతో పాటు సబ్ రిజిస్ట్రార్ రాణి పరిశీలించారు.

'పల్లెకు పోదాం'పై అవగాహన

అమలాపురం రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే పల్లెకు పోదాం కార్యక్రమంపై అమలాపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జోనల్ ఇన్‌చార్జి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమా మాట్లాడుతూ పల్లెకు పోదాం ద్వారా కేంద్ర పథకాలను ప్రచారం చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి పాట్లూరి రామ్మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకట సుబ్బారావు, ఇళ్ల సత్యనారాయణ, ఇళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చిత్తడి నేలలను సంరక్షించుకోవాలని జిల్లా అటవీ శాఖ ఉప అధికారి టి.అనూష అన్నారు. శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరంగి అభయారణ్యంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎం.నాగార్జున, ఎంజీవీ ప్రసాద్, అటవీశాఖ బీట్ అధికారులు పి.సంధ్యారాణి, జి.గోపి, నాగేంద్రకుమార్, కె.మహేష్ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

ఉప్పలగుప్తం: ఎస్.యానంలోని వేదాంత, కెయిన్ ఎనర్జీ అనుబంధ సంస్థ రవ్వ పరిశ్రమకు వెళ్లే మార్గంలో గ్రామస్తులు మరోసారి ఆందోళన చేపట్టారు. స్థానికులకు ఉపాధి కల్పించాలని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, వైద్య బీమాతో పాటు పలు డిమాండ్ల నెరవేర్చాలని ధర్నా చేశారు. ఈ డిమాండ్లపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని వారికి జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎస్ఐ కె.మనోహర జోషి, డీటీ వై.సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఎంవీ రమణ చెప్పినా అంగీకరించలేదు. 13న అధికారులతో చర్చిస్తామని డీఎస్పీ పంపిన హామీ పత్రాన్ని దళిత నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు వినిపించినా గ్రామస్తులు ధర్నా కొనసాగించారు. ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, గ్రామ పెద్దలు జోగి రాజా, అయితాబత్తుల సూరిబాబు, బడుగు అబ్బులు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ల పద్మనాభం పాల్గొన్నారు.

ఎలుకల నివారణ చేపట్టాలి

తాళ్లరేవు: వరిలో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎన్.ప్రశాంతి అన్నారు. శుక్రవారం సామూహిక ఎలుకల నివారణలో భాగంగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.